క్లుప్తంగా

సీఎంను కలిసిన యువజన నేత



ఆమనగల్లు: సీఎం రేవంత్‌రెడ్డిని మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ కార్యదర్శి జెల్ల రమేశ్‌గౌడ్ కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్లు రమేశ్‌గౌడ్ చెప్పారు.

నిధుల మంజూరుపై హర్షం

మాడ్గుల: మండలంలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.08 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం సంబంధిత ఉత్తర్వులు వెల్లడించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేశారని స్థానిక కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఇందులో అధికభాగం విద్యాభివృద్ధికి వెచ్చించనున్నారు. పాఠశాల, కళాశాల భవనాలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మాడ్గుల మండలవాసులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

రేపు 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

వనస్థలిపురం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 5న 'సాక్షి' ఆధ్వర్యంలో, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో (నాగార్జున పాఠశాల ఎదురుగా) ఉదయం 9.30 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9705347239, 9705347248 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.51 వేల విరాళం



గురుస్వాములకు విరాళం అందజేస్తున్న మురళి దంపతులు

నందిగామ: అయ్యప్ప ఆలయ పునఃనిర్మాణానికి అంతిరెడ్డిగూడకు చెందిన నీరటి మురళి శుక్రవారం రూ.51వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ.. ఆలయ పునఃనిర్మాణానికి దాతలు, మాలధారణ స్వాములు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. మూడు నెలల్లో ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గురుస్వాములు నర్సింహయాదవ్, శ్రీకాంత్, కృష్ణ, మల్లేశ్, రాజ్‌కుమార్, ఆలయ పూజారి షణ్ముఖం, పలువురు మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల 'అజరామరం'

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుప్రసిద్ధ కవి, విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు, వాగ్గేయకారులు శ్రీ దొరవేటి రచించిన 'అజరామరం' అనే పద్య నాటికను ప్రదర్శించారు. పాత్రధారులుగా పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు నటించారు. ఈ నాటికకు ప్రముఖ కీబోర్డు ప్లేయర్ శంకర్, తబలా వాయిద్యకారులు రాజశేఖర్, లాల్‌రెడ్డి సంగీతం అందించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి మాట్లాడుతూ.. చారిత్రాత్మక నేపథ్యం కలిగిన నాటికను తమ పాఠశాలలో ప్రదర్శించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఉపాధ్యాయులు కమలేశ్, హనుమంతు, రఫూఫోద్దీన్, శ్రీనయ్య, సురేశ్, మజారుల్లా అన్సారీ, శ్రీనివాస్, రెడ్యా రాథోడ్, సుధాకర్ గౌడ్, నవీన్, శ్రీనివాస్ ఎన్నారం, శివరామ్, హృషికేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి చూపు.. సర్పంచ్ ఎన్నికల వైపు

గ్రామాల్లో మొదలైన రాజకీయ సందడి

- నోటిఫికేషన్ కోసం ఆశావహుల ఎదురుచూపులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్న నాయకులు



బండరావిరాల గ్రామ పంచాయతీ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. సర్పంచుల ఎన్నికలు ఎప్పుడెప్పుడాని కళ్లల్లో వత్తులు వేసుకొని మరి ఆశావహులు ఎదురు చూస్తున్నారు. సార్వత్రికలు ఎన్నికలు జరగడంతో పాటు పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసి ఏడాది కావస్తుండడంతో గ్రామాల్లో ఓట్ల పండుగపై ఉత్కంఠ నెలకొంది. గతేడాది జనవరిలోనే పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతుంది. రోజుకో ప్రకటనతో గ్రామాల్లో స్థానిక రాజకీయం ఊపందుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా.? ఎప్పుడు రిజర్వేషన్లు ప్రకటిస్తారా.? అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయన్న నమ్మకంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. తమ గ్రామాలకు ఏ రిజర్వేషన్లు రావచ్చు అనే సందేహాలను ఎవరికి వారు తెలిసిన అధికారులను అడిగి తెలుసుకుంటున్నట్లు సమాచారం. అయితే గత పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన రిజర్వేషన్లే ఈసారి వర్తింపజేస్తారని ఆశాభావంతో చాలా మంది ఉన్నారు. ప్రభుత్వం తాజాగా కులగణన చేపట్టిన నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వ్యూహాలు రచిస్తున్న పార్టీలు

మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉండేవి. అయితే పంచాయతీల పదవీ కాలం ముగిసిన తర్వాత ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న రెవెన్యూ గ్రామాలను స్థానిక మున్సిపాలిటీలో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో మండలంలో గ్రామాలు తగ్గాయి. 18 ఊర్లుండగా అందులో 4 పంచాయతీలను పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం 14 గ్రామ పంచాయతీలే కొనసాగుతున్నాయి. 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి భారీ మెజార్టీతో గెలవడంతో పాటు రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నేతల్లో ఉత్సాహం పెరిగింది. గ్రామాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి.

మున్సిపాలిటీ అంటూ ప్రచారం!

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం నగరానికి చేరువలో ఉండడంతో ప్రభుత్వం పంచాయతీగానే కొనసాగిస్తూ ఎన్నికలు నిర్వహిస్తుందా..? లేక కొన్ని గ్రామాలతో కలిపి నూతనంగా మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తుందా..? అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయాల్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వస్తుందోనని రాజకీయ నాయకులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్ ప్రకటించే అవకాశాలున్నాయని గ్రామాల్లో చర్చ కొనసాగుతోంది.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఆదిబట్ల చైర్మన్ నిరంజన్‌రెడ్డి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 9వ వార్డులో రూ.29 లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ, 5వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదిహేను వార్డుల్లో సమస్యలు లేకుండా కృషి చేస్తున్నామన్నారు. భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, తాగునీరు వసతి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, లావణ్య, కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, రాజు, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీశైలం, శ్రీకాంత్‌గౌడ్, నాయకులు అమరేందర్‌రెడ్డి, బాబు, నర్సింహ, వెంకటయ్య, అధికారులు ఏఈ శ్రావణ్‌కుమార్, మేనేజర్ రమేశ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్ల మంజూరుపై హర్షం

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేయడం హర్షణీయమని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదించడంతో నిధులు వచ్చాయన్నారు. మున్సిపాలిటీల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన నిధులు 2019 నుంచి నిలిచిపోయాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో నిధులు విడుదల చేశారన్నారు. వీటితో మున్సిపాలిటీలో పనులు చకచక సాగుతాయన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి

బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్



ఇబ్రహీంపట్నంలో ర్యాలీ చేపట్టిన నాయకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మల్లేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, నాయకులు వేణు, ఆంజనేయులు, బాల్‌రాజ్‌యాదవ్, ధనుంజయ్, బీసీ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

రేపు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

మంచాల: మండలంలోని బండలేమూర్ గ్రామంలో ఆదివారం '5కే రన్' నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ మంగ శ్రీనివాస్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా యువత డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పించనున్నారు. దీనికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, మంచాల సీఐ మధు హాజరవుతారని తెలిపారు.

9న కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఈనెల 9న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొత్త మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించే వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆమనగల్లు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూ సర్వేచేసి హద్దులు గుర్తించండి

నందిగామ: మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామానికి ఆనుకొని సర్వే నంబర్ 37లో ఉన్న లావుని భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించాలని కోరుతూ తహసీల్దార్ రాజేశ్వర్‌కు శుక్రవారం గ్రామస్తులు వినతి పత్రం అందించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న ఈ భూమి కబ్జాలకు గురవుతోందని, సర్వే చేసి హద్దులు చూపి మిగిలిన స్థలాన్ని గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కేటాయించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వీరేందర్ గౌడ్, సాములయ్య, వేణుగోపాల్, దేవేందర్ గౌడ్, రాఘవేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా అందుతుంది

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు రైతు భరోసా అందించి ఆదుకుంటుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కావలి బుగ్గ రాములు అన్నారు. శుక్రవారం ఆరుట్లలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రైతులకు రూ.2లక్షలు పంట రుణాలు మాఫీ చేసిందన్నారు. పెటుబడి సాయం కింద కచ్చితంగా రైతు భరోసా అందింస్తుందని పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా శ్రమించాలి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన యాచారం నాయకులు

యాచారం: సంక్రాంతి పండుగ తర్వాత స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయని, అన్ని గ్రామాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే సర్పంచులు, ఎంపీటీసీలుగా గెలిచేలా సమష్టిగా పని చేయాలన్నారు. ప్రజల మధ్యన ఉండి, పార్టీ బలోపేతం కోసం కృషి చేసే వారికే ప్రజాప్రతినిధులుగా పోటి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. పార్టీ శ్రేణుల ఉమ్మడి నిర్ణయంతోనే అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, జంగీర్, సంపత్, మురళీ, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంఘాన్ని ఏర్పాటు చేయండి

డీసీసీబీ చైర్మన్‌కు యాచారం పీఏసీఎస్ పాలకవర్గం విజ్ఞప్తి



తుర్కయంజాల్: ఎమ్మెల్యే రంగారెడ్డికి డైరీ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రామంలో మరో సంఘాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని యాచారం పీఏసీఎస్ పాలకవర్గం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యకు విజ్ఞప్తి చేసింది. డీసీసీబీ కార్యాలయంలో శుక్రవారం కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుపై పాలకవర్గం అభిప్రాయాలను ఉన్నతాధికారులు సేకరించారు. యాచారం పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల డైరెక్టర్లు పాల్గొని.. మండలంలోని 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, 7 వేలకు పైగా సభ్యులున్నారన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే మాల్ పీఏసీఎస్‌తో పాటు నక్కర్తమేడిపల్లి గ్రామంలో కూడా సంఘాన్ని ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదయ్యగౌడ్, డైరెక్టర్లు బాషా, మధుకర్ రెడ్డి, నరేందర్, ఐలయ్య, శశికళ, స్వరూప, కళమ్మ, లక్ష్మయ్య, సీతాఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టెస్కాబ్ వైస్ చైర్మన్

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టెస్కాబ్ రూపొందించిన నూతన సంవత్సర డైరీని అందజేశారు.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల దీక్ష



మున్సిపల్ కమిషర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

ఆమనగల్లు: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 4, 5 తేదీల్లో ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, జిల్లా నాయకులు రవి, విజయ్‌కుమార్‌లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వసంతకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు గోపాల్, పెంటయ్య, రాములు, నర్సింహ, సురేశ్, యాదమ్మ, సుగుణమ్మ, హంసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన పాలకవర్గం



మున్సిపల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా

ఆమనగల్లు: మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో తమను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు వేల పక్కా ఇళ్లు తీసుకువస్తామని అధికారం చేపట్టిన బీజేపీ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ ఆరోపించారు. మున్సిపాలిటీ పాలకవర్గం ఐదేళ్లు పూర్తి కావస్తున్నా ఒక్క ఇళ్లు తీసుకురాలేదని ఆయన విమర్శించారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పక్కా ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పత్యానాయక్ మాట్లాడుతూ.. హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకులు ప్రజలను మర్చిపోయారన్నారు. హామీలు నెరవేర్చడంలో బీజేపీ పాలకవర్గం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అనంతరం అర్హులైన వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్ వసంతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిరంజన్‌గౌడ్, రఘు, సయ్యద్ ఖలీల్, సాయిలు, వెంకటేశ్, రమేశ్, చంద్రునాయక్, శివకుమార్, సైదులుగౌడ్, ప్రసాద్, రంజిత్, జగన్, యాదయ్య, గణేశ్, మహేశ్, దేవేందర్, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి సేవలు మరువలేనివి

అణగారిన వర్గాలకు అక్షర జ్ఞానాన్ని అందించిన సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాన్ని ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం'గా నిర్వహించాలని ప్రకటించడంతో ప్రభుత్వ, ప్రైవేట్లు పాఠశాలల్లో శుక్రవారం వేడుకలు మిన్నంటాయి. విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్నవర్గాలకు ఆమె చేసిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. పలుచోట్ల మహిళా టీచర్లను సన్మానించారు.

– సాక్షి, నెట్‌వర్క్



అబ్దుల్లాపూర్‌మెట్: మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినులకు సత్కారం



ఇబ్రహీంపట్నం: బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి జయంతి కార్యక్రమం



ఆమనగల్లు: సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కడ్తాల్: సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు



మాడ్గుల: ఇర్విన్‌లో ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



తుర్కయంజాల్: బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో..



హయత్‌నగర్: రావినారాయణరెడ్డి కాలనీలోని పాఠశాలలో ఉపాధ్యాయురాలికి సన్మానం



మంచాల: కేజీబీవీలో జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ రాందాస్

రాజ్యాధికారంతోనే హక్కుల సాధన

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: రాజ్యాధికారంతోనే హక్కులు సాధించుకునేందుకు అవకాశం ఉంటుందని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగర్‌కుంటలో బీసీ సేన గ్రామ కమిటీని ఎకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా ఆనందం, ఉపాధ్యక్షులుగా రమేష్‌గౌడ్, మహేందర్, ప్రధాన కార్యదర్శిగా రాకేశ్, కార్యదర్శులుగా వెంటయ్య, కృష్ణయ్య, శ్రీశైలం, రవి, రమేష్, సలహాదారుగా రాజేందర్‌గౌడ్, సభ్యులుగా ప్రసాద్, మల్లయ్య, వెంకటయ్య, ఎల్లయ్య, సత్తయ్య, అంజయ్య తదితరులు ఎనుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. బీసీలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలన్నారు. బీసీల లెక్క తేల్చేందుకు దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని.. పంచాయతీరాజ్ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా పోరాడుతున్నా బీసీల బిల్లును కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు పాల్గొన్నారు.



నూతన కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ